**కథ**

# మాతృత్వం

**విజయప్రభ**

**లంచ్ టైములో స్వీట్ బాక్సు లోంచీ మైసూర్‌పాక్‌లు తీసిచ్చింది శ్రీలత- సులోచన, సుజాతలకు.**

**"ఏమిటి విశేషం" అడిగింది సులోచన మైసూర్ పాక్ కొరుకుతూ.**

**"ఈవాళ లత మేరేజ్ యానివర్సిరీ" చెప్పింది సుజాత.**

**సుజాత, శ్రీలత గత ఆరేళ్ళుగా కలిసి పనిచేస్తున్నారు. సులోచన ట్రాన్స్‌ఫర్ అయి వచ్చింది ఎనిమిది నెలల క్రితం. త్వరలో వీళ్ళతో చక్కగా కలిసిపోయింది సులోచన.**

''అయితే ఈవేళ ఆఫీసుకి ఎగనామం పెట్టేసి, హాయిగా ఎక్కడికైనా చెక్కెయ్యకపోయారా'' అంది సులోచన. బదులుగా చిరునవ్వే సమాధానం శ్రీలత నుంచి.

లంచ్ టైము పూర్తి అవ్వటంతో ఎవరి సెక్షన్‌లకు వాళ్ళు వెళ్ళిపోయారు. సాయంత్రం ఆఫీసు పూర్తయ్యాక శ్రీలత సుజాత సెక్షనకు వచ్చి ''నాతో అరగంట గడపగలవా సుజా'' అంది.

''దానికేం భాగ్యం'' అంది సుజాత. శ్రీలత గత కొద్దికాలంగా స్తబ్దుగా ఉండటం గమనిస్తోంది సుజాత.

ఇద్దరూ వెళ్ళి ఉడిపి హోటల్‌లో కూర్చున్నారు. శ్రీలత రెండు మసాలా దోశలు ఆర్డరు చేసింది. ''సుజా ఈమధ్య మురళి ఎంతో మారిపోయాడు. నాతో ఇదివరకట్లా ఉండటం లేదు'' అంది శ్రీలత కళ్ళనీళ్ళు తిరుగుతుండగా.

''కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది మా మధ్య. తన ఆఫీస్ కొలీగ్స్‌తోనూ, స్నేహితులతోనూ ఉత్సాహంగానే ఉంటున్నాడు. నాతో కనీసం ఏకాంతంలో కూడా సరిగా మాట్లాడటం లేదు'' అంది మళ్ళీ తనే.

మౌనంగా వింటూండిపోయింది సుజాత సమస్య ఎందువల్ల వచ్చి ఉంటుందోనని ఆలోచిస్తూ.

''పోనీ నేనే తన మనసు కనుక్కుందామని తరచి తరచి అడిగినా 'ఆ..ఊ' అన్న ముక్తసరి సమాధానాలే తప్ప మనసు విప్పి మాట్లాడటం లేదు'' అంది. మరీ మరీ అడిగితే విసుక్కుని వెళ్ళిపోతున్నాడు అంది.

శ్రీలత గురించీ, శ్రీలత మురళిల వివాహం గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తి సుజాత.

శ్రీలత, సుజాత పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో క్లాస్‌మేట్స్. మాధ్యూ కూడా వాళ్ళతోటే ఎమ్.ఏ. సోషియాలజీలో చేరాడు. శ్రీలత మాధ్యూల స్నేహం మొదటి సంవత్సరంలో ప్రారంభం అయ్యి, రెండవ సంవత్సరంలో వారిని ప్రేమికులుగా మార్చింది. రెండవ సంవత్సరంలోనే మాధ్యూకు బ్యాంక్‌లో ఉద్యోగం దొరకటంతో చదువుకు స్వస్తి చెప్పి బాంకులో చేరిపోయాడు. శ్రీలత చదువు పూర్తికాగానే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇరుప్రక్కల పెద్దలకూ, ఈ మతాంతర వివాహం సమ్మతం కాకపోవటంతో వారు రిజిస్టర్డ్ మారేజ్ చేసుకోవటం జరిగింది. పెళ్ళికి స్నేహితులే పెద్దదిక్కులయ్యారు. వివాహం జరిగిన వెంటనే, శ్రీలతకు ఎల్.ఐ.సి.లో ఉద్యోగం రావటం జరిగిపోయింది.

వైవాహిక జీవితంలో అడుగు పెట్టీ పెట్టకముందే మాధ్యూ స్కూటర్ ఆక్సిడెంటులో మరణించాడు. ఈ పరిణామం శ్రీలతను ఎంతో కృంగదీసింది. స్నేహితుడు, ప్రేమికుడు, జీవన సహచరుడూ అయిన మాధ్యూ ఆరు నెలలకే తనను విడిచిపెట్టి పోవటంతో ఆమె మానసికంగా ఎంతో కృంగిపోయింది. శ్రీలత తండ్రి జనార్దనరావు కూతుర్ని అక్కున చేర్చుకున్నాడు. దేవుడుకి ఎంత నిర్దయ, తమ మీద అనుకుంటూ కూతురి భవిష్యత్తు గురించి ఆలోచించసాగాడు. నిండా పాతిక సంవత్సరాలైనా నిండని కూతురు జీవితం ఏమిటి అన్న ప్రశ్న మొదలైంది.

ఇటువంటి పరిస్థితుల్లో తన మేనల్లుడు మురళి గుర్తుకు వచ్చాడు. చిన్నప్పుడే జనార్దనరావు చెల్లెలు సుభద్ర భర్తను కోల్పోయి అన్న పంచన చేరింది. మురళిని జనార్దనరావుగారే చదివించారు. స్వతహాగా తెలివి కలవాడటంతో ఇంజనీరింగ్ పూర్తి చేసిన తరువాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం దొరికింది.

చిన్నప్పటినుంచీ తెలిసిన మేనల్లుడే అయినప్పటికీ, భర్తను కోల్పోయిన లతను పెళ్ళి చేసుకొమ్మని అడగటానికి ఇబ్బంది పడ్డాడు. సరే అడిగి చూద్దాం, ఫలితం దైవ నిర్ణయం అనుకున్నాడు.

★ ★ ★

మురళికి మేనమామ, అత్తయ్య మీద అపారమైన గౌరవాభిమానాలు. వాళ్ళు తనను శ్రీలతతో సమానంగానే చూశారు తప్ప తనను ఏనాడూ లోకువగా చూడలేదు. ఇక శ్రీలత, మంచులో తడిసిన మల్లెలాగా స్వచ్ఛంగా ఉండేది. ఆమెను చూడగానే ఒక పులకింత, ఒక చల్లని పిల్ల తెమ్మెర తాకిన భావన. ఆమెను ప్రపోజ్ చేస్తే ఎలా ఉంటుంది అని ఆలోచించే లోపే, ఆమె మాధ్యూకి మనసిచ్చింది అని తెలిసినప్పుడు మనసు ఎంతో విలవిల్లాడిపోయింది. అయితే త్వరగా వాస్తవం అంగీకరించాడు. తమ మధ్య ఏనాడూ 'ప్రేమ' అన్న మాట తలెత్తలేదు. తన ఆరాధన మనసులో ఉంచుకున్నాడే తప్ప ఆమె ఎదుట బయట పెట్టింది లేదు. తను ఏవేవో ఊహించుకుంటే, అది శ్రీలత తప్పేలా అవుతుంది. వారి జీవితం కలకాలం సంతోషంగా సాగాలని భగవంతుడిని కోరుకున్నాడు.

★ ★ ★

శ్రీలతకు రెండు రోజుల నుంచీ నీరసంగా ఉండటంతో డాక్టర్ దగ్గరకు వెళ్ళింది తన అనుమానం నిజం కాకూడదని ప్రార్థించుకుంటూ. డాక్టర్ కంగ్రాట్స్ చెప్పి ప్రెగ్నెన్సీలో ఏమి మందులు వాడాలో రాసిస్తూ జాగ్రత్తలు చెప్పింది.

మాధ్యూ బ్రతికి ఉంటే, ఇది ఎంతో సంతోషించవలసిన వార్త. ఈ బిడ్డను ఒంటరిగా ఎలా పెంచగలను అనే దిగులు ఏ కాస్తయినా సంతోషం ఉంటే, దానిని డామినేట్ చేస్తుంది. తండ్రి ఇప్పుడు- మురళిని చేసుకొమ్మని చేసిన ప్రతిపాదనను వ్యతిరేకించలేకపోయింది. అలాగని మాధ్యూని మరిచిపోయిందా అంటే అదీ లేదు. మనసు ఏ నిర్ణయం తీసుకోలేక అటూ ఇటూ ఊగిసలాడుతోంది.

★ ★ ★

అదే సమయంలో...

జనార్దనరావు మురళితో ''మురళీ, నిన్ను ఈ విధంగా అడగటం అన్యాయమే. అయితే నా కూతురి మీద ప్రేమ నిన్ను ఈ ప్రశ్న అడిగేటట్లు



చేయిస్తుంది నన్ను'' అని ఆగారు.

మళ్ళీ తనే ''నువ్వు..నువ్వు..శ్రీలతకు కొత్త జీవితం ఇవ్వగలవా'' అన్నారు తలదించుకుంటూ.

మురళి నిరుత్తరుడయ్యాడు. మాధ్వ్యా మరణం గురించి విన్న మురళి ఎంతో బాధపడ్డాడు. అయితే ఈ విధమైన ప్రశ్నను ఊహించలేకపోవటంతో తడబడ్డాడు. మౌనంగా ఉండిపోయాడు.

''మురళీ, నిన్ను చిన్నప్పటినుంచీ పెంచిన మామగా, నీమీద నేను వత్తిడి తెస్తున్నానని అనుకోకు. నీకు పూర్తిగా ఇష్టమైతేనే ఒప్పుకో. లేకపోతే ఎటువంటి మొహమాటాలకు పోవద్దు. నిన్ను చిన్నతనం నుంచీ చూస్తుండటంతో నీ వ్యక్తిత్వం ఎరిగిన వాడిగా అడుగుతున్నాను. లతకు అసలు నిన్నిచ్చి చేద్దామన్న ఉద్దేశ్యం నాకు మొదటినుంచీ ఉంది. నా ఉద్దేశ్యం చెప్పేలోగా తను తన నిర్ణయం చెప్పేసింది. లతకు పునర్వివాహం చెయ్యాలి అని నా నిర్ణయం. నువ్వు కాదంటే, వేరే సంబంధం చూస్తాను. బాగా ఆలోచించుకో'' అనేసి వెళ్ళిపోయారు.

''మామయ్యా, నాకు లతను పెళ్ళి చేసుకోవటానికి ఎటువంటి అభ్యంతరం లేదు. మరి తన ఉద్దేశ్యం అడిగారా'' అన్నాడు మురళి.

జనార్దనరావు తన అదృష్టాన్ని నమ్మలేకపోయారు. తరువాత ''బాబూ, నువ్వు నిజంగా ఆలోచించుకునే చెప్తున్నావా'' అన్నారు.

''నిజం మామయ్యా'' అన్నాడు మురళి.

★ ★ ★

మురళి నిర్ణయం జనార్దనరావు ద్వారా శ్రీలతకు తెలియటం జరిగింది.

''మురళీ నీతో మాట్లాడాలి'' అంది శ్రీలత సాయంత్రం అతనికి కాఫీ ఇస్తూ.

''చెప్పు లతా'' అన్నాడు మురళి కప్పు అందుకుంటూ.

''మురళీ, నీకు ఇంకా పెళ్ళి కాలేదు. మంచి ఉద్యోగంలో ఉంటూ, అయిదంకెల జీతం అందుకుంటున్న వాడివి. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నావు? నాన్న బలవంతం చేసారా'' అంది తండ్రికి తనపై ప్రేమ తెలిసున్నదవటంతో. తల్లి తను డిగ్రీ చదువుతున్నప్పుడు చనిపోవటం జరిగింది. అప్పటినుండీ తండ్రి తనపై మరింత ప్రేమాభిమానాలు కురిపించసాగాడు.

''లేదు లతా, మామయ్య ఏమీ బలవంతం చెయ్యలేదు. ఒక మాట చెప్పనా, నాకు నిన్ను చేసుకోవాలని ముందునుంచీ ఉండేది. నీకు చెప్పేలోగా..'' అని ఆగిపోయాడు.

లతకు ఇది నమ్మలేనట్లు అనిపించింది. జీవితంలో ఒకదాని తరువాత మరొకటి వెను వెంటనే జరుగుతున్న మార్పులని జీర్ణించుకోవటానికి అవస్థ పడుతున్నది. తండ్రితో చెప్పింది, నాన్న నాకిప్పట్లో పునర్వివాహం వద్దు. కొంతకాలం గడవనివ్వండని. అయితే జనార్దనరావు కూతుర్ని ఆ పరిస్థితుల్లో చూడలేకపోతున్నారు. ఇప్పటికే రెండుసార్లు బైపాస్ సర్జరీ జరిగిన తండ్రికి ఏమైనా అయితే తట్టుకోలేదు. అలాగే అవివాహితగా జీవితం గడపటానికీ సుముఖంగా లేదు.

కొన్నాళ్ళ తరువాత జరిగే పెళ్ళిని, ఇప్పుడే చేసుకుంటే ఏమి అన్న నిర్ణయానికి వచ్చింది.

ఆలోచనల లోంచీ తెప్పరిల్లి ''మురళి నేను..నాకు..మూడవ నెల ఇప్పుడు'' అని చెప్పేసింది. మురళి ముఖం మ్లానయ్యింది. ఈ పరిణామానికి మాత్రం సిద్ధంగా లేడు. మౌనంగా ఉండిపోయాడు.

నిజానికి, శ్రీలతకూ కడుపులో బిడ్డమీద మమకారం లేదు. ఆ కడుపులో బిడ్డను తన భవిష్యత్తుకు అవరోధంగానే భావించింది. ఈ విషయంలో తనను తను ప్రశ్నించుకుంది. అన్నీ సవ్యంగా జరుగుతూంటేనే ఒక మనిషికి మరో జీవి మీద ప్రేమ, పాశం చివరకు తన బిడ్డపైనైనా అనుకుంది. కానీ అంతరంతరాల్లో తను చేస్తున్నది తప్పుగానే తోచింది.

ఫలితం అబార్షన్ చేయించుకుని మురళి చేత తాళి కట్టించుకుంది.

వివాహం సింపుల్‌గా జరిగిపోయింది. లత అప్పటికే వైవాహిక జీవితం గడిపింది, తనకు ఈ అనుభవం కొత్తకాదు అన్న వాస్తవం జీర్ణించుకున్నాడు. లతను ఎంతో ప్రేమగా చూసుకోసాగాడు. తమ వివాహం దైవనిర్ణయం, గతం ఏమైనప్పటికీ, లత ఇప్పుడు తన భార్య అని ఆమెకు సర్వ సుఖాలు అందించసాగాడు.

★ ★ ★

కాలచక్రంలో నాలుగు సంవత్సరాలు తిరిగిపోయాయి. వారి జీవితంలో పిల్లలు లేని లోటు మురళిని బాధించసాగింది. లత ఈ విషయం పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. ఒకరోజు డాక్టరు దగ్గరకు వెళ్ళిన మురళికి పెద్ద షాక్ ఎదురైంది. తనకు పిల్లలు పుట్టే అవకాశం లేదని చెప్పారు. స్పెర్మ్ కౌంటు మామూలుకంటే చాలా తక్కువగా ఉంది.

మురళికి చెప్పలేనంత బాధ. తను తండ్రి కాలేడు అన్న బాధకన్నా, లత గురించిన బాధే ఎక్కువైంది. ఆనాడు లతకు తాను ధైర్యం చెప్పి ఉంటే, తను బిడ్డకు జన్మనిచ్చి ఉండేది అని చేసిన తప్పునకు నిలువునా దహించుకుపోయాడు. అప్పటినుంచీ అపరాధ భావంతో శ్రీలతతో మునుపటిలా ఉండలేకపోతున్నాడు.

సుజాత చెప్పింది శ్రీలతకు ''కొన్నాళ్ళు ఏకాంతంగా ఎక్కడికైనా తిరిగి రండి. కొత్త ప్రదేశంలో రొటీన్ నుంచీ మార్పు వస్తుంది. మురళి మళ్ళీ ఎప్పటిలా అవుతాడు''

శ్రీలత అప్పటికప్పుడు ట్రావెల్ ఏజెంటు దగ్గరకు వెళ్ళి అరకులోయకు టికెట్స్ బుక్ చేసింది.

★ ★ ★

వారం తరువాత అరకులో రోజంతా సరదాగా బొర్రా గుహలలో తిరిగి వచ్చిన తరువాత రాత్రి మురళి గుండెలమీద తలపెట్టుకుని అడిగింది లత ''మురళీ ఏమైంది నాతో మునుపటిలాగా ఉండటం లేదు. నేను ఏమైనా తప్పు చేసానా? చెప్పవూ'' అంటూ.

''నేను డాక్టరు దగ్గరకు వెళ్ళాను. మనకు, నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదు'' అని ఒక్క క్షణం ఆగి,

''నేను మనం ఆరోజు అలా చెయ్యకుండా ఉండవలసినది. నేను బిడ్డను వ్యతిరేకించకపోయినా, ఆదరించేంత సహృదయం లేకపోయింది. నీకు ధైర్యం చెప్పి ఉంటే, నువ్వు బిడ్డకు జన్మనిచ్చుండేదానివి కద'' అన్నాడు మురళి దుఃఖం ఎగదన్నుకు వస్తుంటే.

లత ఖిన్నురాలైంది. తాను చేసిన తప్పునకు దేవుడు సరైన శిక్ష విధించాడనుకుంది. తల్లి తన బిడ్డలకోసం సర్వ సుఖాలను త్యజిస్తుంది. ఎన్నో కష్టనష్టాలకోర్చి బిడ్డలను పెంచుతుంది. కానీ, తను ఏం చేసింది? స్త్రీ జాతికి అవమానం తెచ్చింది. తన సుఖం కోసం, కడుపులో పెరిగే బిడ్డను హత మార్చటానికి ఏమాత్రం వెనుదీయలేదు. తను చేసిన ఈ తప్పునకు జీవితకాలం శిక్ష అనుభవించపోతున్నానని అనుకుంది. ఆ రాత్రి ఇద్దరికీ కంటి మీద కునుకు లేదు.

★ ★ ★

మరుసటి రోజు ఉదయం లత చెప్పింది ''మురళీ మనం అనాథ శరణాలయానికి వెళ్ళి ఒక బిడ్డను దత్తత చేసుకుందాం. ఇంకా అనాథ శరణాలయంలోని పిల్లలకు మనకు శక్తి కొలదీ సహాయం చేద్దాం. నిజంగా జీవనోపాధి లేక వదిలే తల్లిదండ్రులే కాక, పెళ్ళికాకుండా బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులు వదిలి వేస్తుంటారు. మనం చెయ్యగలిగిన సహాయం వారికి చేద్దాం''

లత మాటలకు మనస్ఫూర్తిగా, సంతోషంగా ఒప్పుకున్నాడు మురళి.

★ ★ ★

''సుజా థాంక్స్. నువ్వు చెప్పినట్లే అరకులో మురళి తన మనసు విప్పి మాట్లాడాడు. ఇప్పుడు మాకు పరిష్కారం దొరికింది. ఇదుగో మా పాప రోహిణి'' అని చెప్పింది శ్రీలత తను ఎత్తుకున్న ఆరు నెలల పాపాయిని చూపిస్తూ.

ఈ రోహిణేకాక, ఇంకా రోడ్లపైన బాల్యం కోల్పోతున్న బిడ్డలందరికీ ఏదో రకంగా భగవంతుడు దారి చూపాలని కోరుకుంది సుజాత.



## 'ఒక్కడు' బిజీ!

**సినిమా ఇండస్ట్రీ ఎక్కువగా యూత్‌కి నచ్చే అంశాల్ని పరిగణనలోనికి తీసుకుంటుంది. యూత్ హీరోగా పేరుతెచ్చుకుని సక్సెస్ గ్యారంటీ ఉన్న హీరోగా ఇండస్ట్రీ చేత గుర్తింపు తెచ్చుకున్న మహేష్‌బాబు ఇప్పుడు యూత్ చిత్రాల దర్శకుడు కె.విజయభాస్కర్ దర్శకత్వంలో రూపుదిద్దుకోబోయే కొత్త చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే అతడు హీరోగా జనం ముందుకి రాబోతున్న మహేష్ ఈ ప్రాజెక్టుతో బిజీగా మారిపోతున్నాడన్నమాట.**